6 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
మంగళవారం 18 ఫిబ్రవరి 2025
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## క్యాన్సర్‌కు టీకా

**క్యాన్సర్** మహమ్మారి చాపకింద నీరులా వ్యాపిస్తూనే ఉన్నది. జీవన విధాన సమస్యలు, కాలుష్యం వంటివి క్యాన్సర్లు పెరగడానికి కారణమనేది తెలిసిందే. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల విడుదల చేసిన గణాంకాలు సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి. 2022 నాటికి క్యాన్సర్ కేసులు 2 కోట్లకు చేరుకున్నాయి. క్యాన్సర్ మరణాలు కోటికి కొద్ది దిగువన 97 లక్షలుగా నమోదయ్యాయి. కొత్త కొత్త చికిత్సలు వచ్చి క్యాన్సర్ బారి నుంచి బయటపడి సుదీర్ఘకాలం మనుగడ సాగించేవారి సంఖ్య పెరుగుతున్న మాట నిజమే. అయినప్పటికీ ఈ అసాంక్రమిక మహమ్మారి వల్ల తలెత్తే ఆర్థిక, సామాజిక, కుటుంబ సమస్యలు తక్కువేం కాదు. క్యాన్సర్ చికిత్స సంక్లిష్టమైనదే కాకుండా ఖరీదుతో కూడుకుని ఉంటుంది. ఒక్కో పేషంటుపై సాధారణ వ్యాధుల చికిత్సకు అయ్యే ఖర్చు కన్నా క్యాన్సర్ చికిత్స ఖర్చు నాలుగు రెట్లు ఎక్కువ. ఇవన్నీ పరిగణిస్తే చికిత్స కన్నా నివారణే మేలని అనిపించక మానదు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ టీకాను రష్యా కనిపెట్టిందనే వార్త సహజంగానే అందరిలో ఆసక్తిని కలిగిస్తున్నది.

రష్యాలో క్లినికల్ పరీక్షలు తుదిదశకు చేరుకున్న వ్యాక్సిన్ ఎంఆర్ఎన్ఏ రకానికి చెందినది. సంప్రదాయ వ్యాక్సిన్ విధానంలో రోగ కారక క్రిమిని నిర్వీర్యం చేసి శరీరంలోకి ఎక్కిస్తారు. దానివల్ల శరీరంలో యాంటీబాడీలు తయారై సదరు రోగం నుంచి రక్షణ కలుగుతుంది. కానీ కరోనా కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన ఎంఆర్ఎన్ఏ విధానం ఇందుకు భిన్నమైంది. ఇక్కడ ఆర్ఎన్ఏ ద్వారా శరీరానికి రోగనిరోధకత సమకూరుస్తారు. ఇప్పుడు రష్యా రూపొందించిన టీకా కూడా ఈ కోవలోదే కావడం విశేషం. అయితే నివారణ కోసం ముందస్తుగా ఇచ్చే టీకా కాదిది. క్యాన్సర్ వచ్చిన వారికి కణుతులను వెదికి, ధ్వంసం చేసేలా రోగనిరోధక వ్యవస్థను ఇది సమాయత్తం చేస్తుంది. రోగి ప్రత్యేక శారీరక స్థితిగతులను బట్టి దీనిలో మార్పుచేర్పులు చేసి ఇవ్వడం వల్ల ఇది అత్యంత సమర్థతతో పని చేస్తుంది. నిజానికి టీకా అనే మాట సరైనది కాదు. ఎందుకంటే ఇది నివారణ కోసం ఇచ్చేది కాదు. రోగి శరీరంలో క్యాన్సర్‌ను గుర్తించిన తర్వాతే దీనిని ఇవ్వాల్సి ఉంటుంది.ఈ తరహా టీకా లేదా టీకా చికిత్సను రష్యా మాత్రమే రూపొందించడం లేదు.

ప్రపంచంలో ఈ దిశగా పరిశోధనలు జోరుగానే సాగుతున్నాయి. బ్రిటన్, అమెరికాలో ట్రయల్స్ జరుగుతున్నాయి. అయితే అవి ఇంకా కీలక దశకు చేరుకోలేదు. పైగా అవన్నీ వాణిజ్యపరమైన లాభార్జన దృష్టితో జరుగుతున్నవే. ఈ ఏడాదే కొత్త క్యాన్సర్ టీకాను అందుబాటులోకి తెస్తామని రష్యా అంటున్నది. ఆ టీకాను వాణిజ్యపరంగా సొమ్ము చేసుకోవడానికి ఉపయోగించబోమని, ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందుబాటులోకి తెస్తామని రష్యా ప్రకటించడం ప్రశంసనీయం. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా దీని వల్ల ఏకకాలంలో క్యాన్సర్ మహమ్మారి నుంచి విముక్తి, ఆర్థిక భారం తొలగిపోవడం అనే జంట ప్రయోజనాలు సమకూరుతాయని చెప్పవచ్చు. అయితే క్యాన్సర్‌కు టీకా వచ్చిందని జీవన విధాన సమస్యల పట్ల నిర్లక్ష్యం ఏమాత్రం తగదని చెప్పక తప్పదు.

# దోపిడీ చేయడమే మార్పా?

**'మార్పు కావాలి- కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మొదటి నుంచి ప్రజలను ఏమార్చుతూనే ఉన్నది. తెలంగాణ భవితకు భరోసా ఇస్తామని, ప్రజల బతుకులను బాగు చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ మార్పుకు మంగళం పలికి ఇప్పుడు నిత్యం ప్రజలను ఏడిపిస్తున్నది. మార్పు, ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయక పోగా ఇతర హామీలను కూడా తుంగలో తొక్కింది. ముఖ్యంగా మద్యం విక్రయాలను నియంత్రిస్తామని, రేట్లు తగ్గిస్తామని, బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తేస్తామని హామీ ఇచ్చిన హస్తం పార్టీ నేడు అందుకు విరుద్ధంగా తెలంగాణను బార్లు, బీర్ల తెలంగాణగా మార్చింది.**



బాల్క సుమన్



రేవంత్‌రెడ్డి హయాంలో అన్ని రంగాల్లో తిరోగమిస్తున్న తెలంగాణ.. ఒక్క మద్యం విక్రయాల్లో మాత్రం పురోగమిస్తున్నది. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు ఇస్రో రాకెట్‌తో పోటీపడి నింగిలోకి దూసుకెళ్తున్నాయి. తెలంగాణ బతుకు చిత్రాన్ని ఛిద్రం చేస్తూ మద్యాన్ని ఏరులై పారిస్తున్న రేవంత్‌రెడ్డి.. బడుగు, బలహీన వర్గాలు, పేదల జేబులు గుల్ల చేస్తున్నారు. అత్యంత దుర్మార్గంగా ఆదాయం పెంచుకునేందుకు ధరలు పెంచి పేదల శవాలపై పేలాలు ఏరుకుంటున్నారు. కాసులు, కమీషన్లకు కక్కుర్తి పడి బడుగుల బతుకులను ఆగం చేస్తున్నారు.

మద్యం ధరల పెంపు విషయంలో రేవంత్‌రెడ్డి సర్కారు మొదటి నుంచి గోప్యత పాటిస్తున్నది. బీర్ల కంపెనీలతో ముందస్తుగా లోపాయికారి ఒప్పందం చేసుకున్న కాంగ్రెస్ సర్కారు హైడ్రామా చేసింది. బీర్ల కంపెనీలతో బేరసారాలు చేసిన పాలకులు మొదట ఉద్దేశపూర్వకంగా బిల్లులు ఆపేశారు. ఆ కంపెనీలు డిమాండ్ చేస్తున్నట్టు ధరల పెంపునకు అనుమతించబోమని, పేదలను దోపిడీ చేయడానికి సహకరించమని గప్పాలు కొట్టారు.

> **వాళ్లపై ఒత్తిడి చేసి, సరఫరా నిలిపివేసి, ఆ కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయే పరిస్థితి తీసుకొచ్చారు. ఆ తర్వాత రాత్రికి రాత్రి లోపాయికారి ఒప్పందం చేసుకొని ధరల పెంపునకు అనుమతించారు. ఆ కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లకుండా చేశారు. ఇటు కంపెనీలకు ఆదాయం పెరిగేలా, అటు రేవంత్‌రెడ్డికి ఆర్ఆర్ టాక్స్ రూపంలో కమీషన్లు ముట్టేలా జరిగిన ఈ చీకటి ఒప్పందాన్ని చూస్తుంటే ఇరువురి మధ్య క్విడ్ ప్రోకో జరిగినట్టు స్పష్టంగా అర్థమవుతున్నది.**

ఈ వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తతంగంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉన్నది. మొదట రేట్లు పెంచనని, ప్రజలను దోపిడీ చేయడానికి అనుమతించబోమని తెగేసి చెప్పిన రేవంత్ రెడ్డి ఆ తర్వాత ఎందుకు రేట్లు పెంచాల్సి వచ్చిందో విచారణలో తేల్చాలి. ఏ లోపాయికారి ఒప్పందం వల్ల రేట్లు పెంచాల్సి వచ్చింది? ఏయే కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి? ప్రజలపై ఎందుకు భారం వేస్తున్నారు? తదితర ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

అలవికానీ హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయకపోగా, ఖజానా నింపుకునేందుకు పేద ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటు. సంపద సృష్టించి వాగ్దానాలను నెరవేర్చాల్సింది పోయి ప్రజలను తాగుబోతులను చేసి, ప్రజల జేబులను గుల్ల చేసి, వారి సొమ్మునే తిరిగి పథకాల రూపంలో ఇవ్వాలనుకోవడం విడ్డూరం. ఒక చేత్తో రైతుబంధు ఇచ్చి, మరో చేత్తో మద్యం ద్వారా దోపిడీ చేస్తున్నారని గతంలో విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు చేస్తున్నది ఏమిటి?

అమాయకులైన ప్రజలందరినీ మద్యానికి బానిసలను చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ పల్లెలను నాశనం చేస్తున్నది. మార్పు, ప్రజాపాలన అంటూ ఊదరకొడుతున్న రేవంత్ రెడ్డి సర్కారు గ్రామ ప్రజల జీవితాలను నిర్వీర్యం చేస్తున్నది. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో డ్రగ్స్, గంజాయి, కల్తీ మద్యం, గుడుంబాలతో తెలంగాణ పల్లెలు తాగుడు కేంద్రాలుగా మారిపోయాయి. కల్లు కేంద్రాలపై దాడులు చేస్తున్న ఎక్సైజ్, నార్కోటిక్ బ్యూరో అధికారులు అక్రమ కేసులు బనాయించి గీత కార్మికులను వేధింపులకు గురి చేస్తూ పరోక్షంగా ప్రజలను మద్యం తాగేలా ప్రోత్సహిస్తున్నారు. గీత కార్మికుల సంక్షేమానికి గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయకపోగా, కేసులు బనాయించి వృత్తిని కాటగలుపుతున్నారు.

> **కొత్త పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో మార్పు తీసుకొస్తారని భావించిన రేవంత్‌రెడ్డి మాట తప్పి, ప్రజల జీవితాలను ఆగం చేస్తున్నారు. కంపెనీలు తీసుకొచ్చి, సంపద సృష్టించి యువతకు ఉద్యోగాలు ఇవ్వాల్సింది పోయి తాగుబోతులను చేస్తున్నారు. ధరలు భారీగా పెంచేసి ప్రజలను మద్యానికి బానిసలుగా చేసి జలగల్లా పీక్కుతింటున్నారు. గుడుంబా కేంద్రాలు, బెల్ట్ షాపులకు తోడు కల్తీమద్యాన్ని ఏరులై పారిస్తూ ఎందరో మహిళలను వితంతువులుగా మారుస్తున్నారు. పచ్చని సంసారాలను కూల్చి అనేక కుటుంబాలను అనాథలను చేశారు.**

మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి అంటే ఇదేనా? పల్లెలను నిర్వీర్యం చేయడమే ప్రజాపాలనా? బడుగుల బతుకులను ఆగం చేసి రోడ్డుపై పడేయడమే మార్పా? ఇందిరమ్మ రాజ్యం అంటే కంపెనీలతో లోపాయికారి ఒప్పందం చేసుకొని ప్రజలను దోచుకోవడమా? కంపెనీలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాయా? లేదా కంపెనీల కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారా? అనేది స్పష్టం చేయాలి. ఎన్నికల్లో మాట ఇచ్చినట్టు ఇప్పటికైనా మద్యాన్ని నియంత్రించి పేదల బతుకులు ఛిద్రం కాకుండా కాపాడాలి.

*-(వ్యాసకర్త: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే)*

> **అలవికానీ హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయకపోగా, ఖజానా నింపుకునేందుకు పేద ప్రజలపై భారం మోపడం సిగ్గుచేటు. సంపద సృష్టించి వాగ్దానాలను నెరవేర్చాల్సింది పోయి ప్రజలను తాగుబోతులను చేసి, ప్రజల జేబులను గుల్ల చేసి, వారి సొమ్మునే తిరిగి పథకాల రూపంలో ఇవ్వాలనుకోవడం విడ్డూరం. ఒక చేత్తో రైతుబంధు ఇచ్చి, మరో చేత్తో మద్యం ద్వారా దోపిడీ చేస్తున్నారని గతంలో విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు చేస్తున్నది ఏమిటి?**



## గర్జించు నాయకా..

జనార్దనా! జన విమోచకా!
శిశుపాలుని
వంద తప్పులు పూర్తయినవి
పన్నెండు మాసాల
అరణ్యవాసం
ఒక మాసం అజ్ఞాతవాసం గడిచిపోయినవి!
ఏ గ్యారెంటీల్లేక
జనాలు రుణ విముక్తి కోసం
నిత్యం ఒకటే తండ్లాట
అడుసు తొక్కిన కాళ్లు
ఆశపడ్డ మనసు
పాతాళం లోతులు చవిచూసినవి
యుద్ధం లేకుండానే
విధ్వంసం మొదలైంది!
త్యాగాల మునివాకిట
పెరికి కంప విస్తరిస్తున్నది
మరోసారి పోరు పిలుపుకై
సమూహాలన్నీ సర్వం
సిద్ధంగా ఉన్నాయి
విముక్తి ప్రదాతా!
మీరు గర్జిస్తే కానీ
పొడుస్తున్న పొద్దు మీద
తెలంగాణ ఉదయించదు!!



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

# రేవంత్‌రెడ్డి దేశవ్యాప్త ప్రతిష్ఠ!

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దేశవ్యాప్త ప్రతిష్ఠ లభించడం ఆయన అధికారానికి వచ్చిన కొత్తలోనే 'బీహార్ డీఎన్ఏ' అంటూ మాట్లాడటంతో మొదలైంది. అది, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికాలో పర్యటిస్తూ ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమవుతుండిన రోజునే ఆయన కులం గురించి రేవంత్ వ్యాఖ్యలు చేయడంతో మరింత ఉన్నతమైంది. ఈ రెండు ఉదంతాలకు మధ్య ఏడాది కాలంలోనూ, నూతన ప్రతిష్ఠను దేశమంతటా నిలిపి ఉంచుకునేందుకు ఆయన మరికొన్ని కూడా చేస్తూ వస్తున్నారు.**



టంకశాల అశోక్



'బీహార్ డీఎన్ఏ' విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డి అధికారానికి వచ్చే సమయానికి రాష్ట్ర అధికార యంత్రాంగంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులలో కొందరు బీహార్‌కు చెందినవారు ఉన్నారు. సీనియారిటీ కారణంగా వారిలో కొందరు ముఖ్యమైన స్థానాల్లో పనిచేసేవారు. అఖిల భారత సర్వీసుల అధికారుల ఎంపిక, వారిని వివిధ రాష్ట్రాలకు కేటాయించడం కేంద్ర హోంశాఖ పని. సర్దార్ వల్లభభాయ్ పటేల్ మొదటి హోంమంత్రిగా ఉండిన కాలం నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతున్నది. అందువల్ల తెలంగాణలో బీహార్‌కు చెందినవారు ఉండటంలో స్వయంగా వారికి గాని, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి గాని ఎటువంటి ప్రమేయం లేదు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి ఇతర రాష్ట్రాలకు చెందిన వారి విషయంలోనూ అంతే. వీరందరు కూడా ఉమ్మడి ఏపీలోనూ ఉండేవారు. తెలంగాణ పరిస్థితీ అదే.

> **అటువంటప్పుడు రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా బీహార్ గురించి ప్రస్తావించడం ఎందుకు? ఆ రాష్ట్రానికి చెందిన వారిలో కొందరి పట్లగాని, అందరి పట్ల గాని తనకు ఫిర్యాదులు ఏవైనా, ఏ కారణం వల్లనైనా ఉంటే, వారిని తను కావాలనుకునే శాఖలకు బదిలీ చేయవచ్చు. విజ్ఞత గల ఏ ముఖ్యమంత్రి అయినా చేసేది అదే. కానీ ఆయన అటువంటి విజ్ఞతను, సంయమనాన్ని కోల్పోయి 'బీహార్ డీఎన్ఏ' అనే వ్యాఖ్యలు చేశారు. కేవలం క్షణికావేశంతో సంయమనం కోల్పోయే స్వభావం ఉన్నవారు తప్ప ఇతరులు చేసే పని కాదది.**

ముఖ్యమంత్రి వ్యాఖ్యల ప్రభావం ఏమిటన్నది మనమిక్కడ అర్థం చేసుకోవలసిన విషయం. ఆయన మాటలకు ఆయా అధికారులు ఏమనుకున్నారో తెలియదు గాని, రాష్ట్రంలో వివిధ వర్గాల నుంచి విమర్శలు చాలానే వినిపించాయి. అవి ఇక్కడ మనం విన్నవి. విమర్శలు రాష్ట్రానికి పరిమితమై ఉంటే అది వేరు. కానీ ఈ ఇంటర్నెట్ యుగంలో రేవంత్‌రెడ్డి మాటలు అతి వేగంగా బీహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాలతోపాటు ఆటు దేశ రాజధాని ఢిల్లీకి, హోంశాఖకు కూడా చేరిపోయాయి. ఆశ్చర్యానికి, విమర్శలకు దారితీశాయి. ఇందులో రెండు కోణాలున్నాయి. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, అందులోనూ కొత్తవాడు, బయటి ప్రపంచానికి తన పేరు ఇంకా అంతగా పరిచయం లేనివాడు, కాంగ్రెస్ పార్టీకి చెందినవాడు ఆ తరహా దురభిప్రాయాలతో కూడిన వ్యాఖ్యలు చేయడం ఏమిటన్నది ఒకటి. ఇది సాధారణమైన విమర్శ కాగా, 'బీహార్-బీహారీ' అన్న ప్రస్తావనలు ఉత్తర భారతదేశంలో, మరీ ముఖ్యంగా ఆ రాష్ట్ర ప్రజలకు సంబంధించి చాలా సెన్సిటివ్ మాటలు. వారు వెనుకబడినవారు, చదవనివారు, అల్లర్లు చేసేవారు, తగినంత నాగరికతలేని మొరటు మనుషులన్నది ఉత్తర భారత ప్రాంతాల్లో కొందరి నుంచి వినిపించే అభిప్రాయం. ఇది ఒకప్పుడు తెలంగాణ ప్రజల గురించి ఉమ్మడి రాష్ట్రంలోని కోస్తా వారికి ఉండిన వైఖరి వంటిది. 'యేతో బీహారీ సాలా హై' అనే మాటలు స్వయంగా నేను అనేకసార్లు విన్నాను. నేను చదివిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) వంటి విశిష్టమైన విద్యా సంస్థలోనూ ఈ వైఖరులు కనిపించేవి. మొత్తం మీద ఈ పరిస్థితులు బీహార్ ప్రజలకు చాలా సెన్సిటివ్‌గా మారాయి. సరే ఇవన్నీ రేవంత్‌రెడ్డితో నిమిత్తం లేనివి. కానీ 'బీహారీ డీఎన్ఏ' అన్న మాట ఆయన నోట రావడం ఏమిటన్నది ప్రశ్న. నిజానికి చరిత్రలోకి వెళితే, బీహార్ భూమికి అనేక విధాలైన ఘనతలున్నాయి. దేశంలో మొట్టమొదటిది అయిన మగధ సామ్రాజ్యం, బౌద్ధమత ఆవిర్భావం, మహావిశ్వవిద్యాలయాల స్థాపన మొదలైనవి. విషయానికి మొత్తం మీద ఇది రెండవ కోణం అయింది. రేవంత్‌రెడ్డికి తన పొరపాటు అర్థమై ఉంటే, కనీసం దీనిపై విమర్శలు వచ్చిన వెంటనే, తనకు దురుద్దేశాలు లేవని, మాట తొందరలో అలా వచ్చిందని అనవలసింది. కానీ, అదేమీ చేసినట్టు లేరు. ఆ విధంగా ఆయన మొదట్లోనే సంపాదించుకున్న దేశవ్యాప్త ప్రతిష్ఠ అలాగే నిలిచిపోయింది.

ఇప్పుడు ప్రస్తుతానికి వద్దాము. ఈ నెల 14న మొత్తం దేశం దృష్టి అంతా ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం కావడంపై ఉన్నది. అంతకుముందు మూడు రోజుల్లో ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, వివిధ అమెరికన్ ఉన్నతాధికారులతో సమావేశమవుతుండినా, ట్రంప్ సమావేశపు ప్రత్యేకత గురించి చెప్పనక్కరలేదు. వారి మధ్య ఇతర ముఖ్యమైన అంశాలను అటుంచి, వలస ప్రజల పంపివేత, వాణిజ్య సుంకాల విషయమై ఎటువంటి చర్చలు జరగవచ్చునని సాధారణ మధ్య తరగతి వరకు కూడా భారతీయులు ఉత్కంఠతో ఎదురుచూస్తుండిన సమయమది. సరిగా అవే ఘడియలలో మోదీ కులం గురించి రేవంత్ ఇక్కడ చేసిన వ్యాఖ్యలు వెంటనే అంతటా వ్యాపించి అందరినీ ఉలికిపాటుకు, దిగ్భ్రాంతికి గురిచేశాయి. మోదీ కులం గురించి ఆయన గతంలోనూ మాట్లాడారు. కానీ అవి అప్పటి సందర్భాల వల్ల రాష్ట్రానికి పరిమితమై మిగిలాయి. ఈసారి మోదీ అమెరికా పర్యటన సమయంలో ముడిపడిన సందర్భం కావడంతో సున్నితంగా మారింది. దేశమంతటా దృష్టిని ఆకర్షించింది.

మోదీ ఉన్నత కులస్తుడని, తాను గుజరాత్ ముఖ్యమంత్రి అయిన వెనుక 2002లో తమ తేలీ కులాన్ని ఓబీసీ జాబితాలోకి మార్పించుకున్నారన్నది రేవంత్‌రెడ్డి ఆరోపణ. అది నిజం కాదని, కాంగ్రెస్ అధికారంలో ఉండిన 1994లోనే ఆ మార్పిడి జరిగిందనేది బీజేపీ చెప్తున్న మాట. ఈ ఆరోపణలు, వివరణలు గతంలోనూ ఉన్నవే. ఎవరైనా రికార్డులు పరిశీలించి ఏమైనా స్పష్టం చేశారేమో తెలియదు. చేసి ఉంటే ఆ స్పష్టీకరణలు తన ఆరోపణకు సమర్థనగా ఉన్నట్టయితే రేవంత్‌రెడ్డి ఆ సంగతి వెల్లడించి ఉండవలసింది. అదేమీ చేయకపోవడాన్ని బట్టి తనకైనా స్పష్టత ఉన్నదో లేదోననే సందేహం సహజంగానే కలుగుతుంది. ఆయన తన ఆరోపణ నిజమని గట్టిగా నమ్మితే, కాంగ్రెస్ పార్టీ గుజరాత్ శాఖ ద్వారానో, ఏఐసీసీ ద్వారానో ధ్రువీకరించుకోవడం కష్టం కాదు. మొత్తానికి ఈ తాజా ఉదంతంతో ఆయనకు దేశవ్యాప్తంగా మరింత ప్రతిష్ఠ లభించింది. ఒక ముఖ్యమంత్రి, ఒక ప్రధానమంత్రి కులం గురించి మాట్లాడటమేమిటనే ప్రశ్నను పక్కకు ఉంచినా, ఆ ప్రశ్నను ఎవరైనా బీసీలు లేవనెత్తినా అర్థం ఉండేది కదా అనే విచికిత్సను వదిలి వేసినా, ఇంత చేసీ తన మాట తప్పని తేలడంతో మరునాడు ఢిల్లీలో ఆయన, హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు సర్దుబాటు కోసం నానా తంటాలు పడ్డారు. కులం మార్పు ఒక ప్రక్రియలో భాగంగా అందరి వలెనే మోదీకి జరగడానికి, ఆయన సీఎం అయినాక అధికార దుర్వినియోగంతో ఆ పని చేశారన్న అర్థం తీయడానికి తేడా లేదా?

పైన అనుకున్నట్టు ఈ రెండు ఉదంతాల మధ్య కాలంలోనూ రేవంత్‌రెడ్డి తన ప్రతిష్ఠను సజీవంగానే ఉంచుకున్నారు. అందుకు దోహదం చేసిన వాటిలో ఆయన మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీల అమలు గురించి అసత్యాపూర్వకంగా సాగించిన ప్రచారాలు ఒక శ్రేణిలోకి రాగా, ఇతరత్రా తన పరిపాలన ఎంత గొప్పగా సాగుతున్నదో అంతటా తెలిసి వస్తుండటం మరొక శ్రేణిలోకి వస్తుంది. ఈ రెండింటి గురించిన వివరాలు, విశేషాలు తెలిసినవే అయినందున ఇక్కడ మళ్లీ చెప్పుకోవాల్సిన పనిలేదు. ఒక్క మాట మాత్రం ప్రస్తావించాలంటే, ఢిల్లీలో తాము 'ఆప్' వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించగలిగాము గాని బీజేపీని ఓడించలేకపోయామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నర్మగర్భంగా మాట్లాడగా, మొరటు ధోరణులు తప్ప అటువంటి కళ తనకెప్పుడూ లేదని ప్రతిసారీ చాటి చెప్పుకునే రేవంత్‌రెడ్డి, తమను హర్యానాలో'ఆప్' ఓడించిందని, అందుకు బదులుగా వారిని ఢిల్లీలో కావాలనే ఓడించామని తన నిజాయతీని వెల్లడించుకున్నారు. ఆ విధంగా తన అఖిల భారత ప్రతిష్ఠకు మరింత మెరుగును దిద్దుకున్నారు. ■

**'మేమెంతో మాకంత వాటా' అన్న కాన్షీరాం నినాదం నీరుగారేలా ఉన్నది ప్రభుత్వం చేపట్టిన కులగణన. రాజ్యాధికారం చేపట్టని కులాలు, జాతులు అంతరించిపోతాయన్న మహనీయుల మాటలు నిజమయ్యేలా ఉన్నది కులగణన నివేదిక. 78 ఏండ్ల భారత స్వయం పాలనలో పార్లమెంటు చూడని కులాలు ఇంకా చాలా ఉండటం బాధాకరం. బీసీలకు రాజకీయాల్లో వాటా దక్కకుండా కుట్ర జరుగుతున్నదనే అనుమానాలకు ప్రస్తుత పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి.**

# ప్రభుత్వ కుట్ర.. క్షమించదు చరిత్ర



బండారు జితేందర్
93912 94127



భారతీయులందరూ సమానమేనని, అందరికీ సర్వహక్కులు వర్తిస్తాయని భారత రాజ్యాంగ ప్రవేశిక స్పష్టం చేస్తుంది. కానీ అందుకు భిన్నంగా కొన్ని వర్గాల్లో మాత్రమే పాలనాధికారం ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఇప్పుడు రాజకీయ పార్టీలకు కులగణన అస్త్రంగా మారింది. అందులో భాగంగానే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన హామీని కాంగ్రెస్ ఇచ్చింది. ఎన్నికలు ముగిశాయి. ప్రభుత్వ మార్పిడి జరిగింది. కానీ, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైంది. రాజకీయాల్లో బీసీలకు వాటా దక్కకుండా ప్రభుత్వమే కుట్రలు చేయడాన్ని చరిత్ర క్షమించదు.

> **రాజ్యాధికార పోరాటకాంక్షలతో ఉద్యమాలు చేస్తున్న వారు ఇక భవిష్యత్తులో అలాంటి ఉద్యమాలు చేయకుండా ఒక మోసపూరిత ప్రణాళికతో కులగణనకు ఈ రాష్ట్ర ప్రభుత్వం పూనుకున్నది. బీసీల వ్యతిరేకి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సబ్ కమిటీకి చైర్మన్‌గా నియమించడమే ఇందుకు ఉదాహరణ. బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులపై అవగాహన లేని, బీసీలు అంటేనే చిన్న చూపు చూసే ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కులగణనకు సంబంధించిన సబ్ కమిటీకి చైర్మన్‌గా నియమించడంలోనే ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో చెప్తున్నది.**

మంత్రివర్గంలో ఉత్తమ్ కంటే సీనియర్లు అయిన పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ వంటి బీసీ మంత్రులు ఉన్నప్పటికీ వారిని కాకుండా ఉత్తమ్‌నే నియమించడం వెనక మతలబును అర్థం చేసుకోవచ్చు. అఖిలపక్ష సమావేశాలుగానీ, కులసంఘాల సమావేశాలు గాని నిర్వహించకుండానే కులగనన పూర్తి అయినట్టు ప్రభుత్వం ప్రకటించింది.

సాధారణంగా రిజర్వేషన్లపై చట్టం చేస్తే రాజకీయ పార్టీలు బీసీలకు టికెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, బీసీలకు మెజార్టీ టికెట్లు ఇవ్వాలని ప్రభుత్వంలో ఉన్న వారే డిమాండ్ చేయడం అవివేకం. ఎస్సీ వర్గీకరణ, కులగణన రెండు అంశాలు చాలా కీలకమైనవి. కానీ, మూడు దశాబ్దాల పోరాటం తర్వాత కొలిక్కి వచ్చిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికను హడావుడిగా అసెంబ్లీలో పెట్టి, దానిపై చర్చ పెట్టి ప్రజాపోరాటాన్ని అవమానించేలా చేసిందీ ప్రభుత్వం. మెజారిటీ ప్రజల స్థితిగతులపై చర్చించేటప్పుడు విపులంగా, సమగ్రంగా ఆధారాలతో చర్చించాల్సిన ప్రభుత్వం ఒకే రోజు రెండు అంశాలను చర్చకు పెట్టి మమ అనిపించడం సరికాదు. ఎస్సీ వర్గీకరణ మూడు దశాబ్దాల ప్రజా పోరాటం. అటువంటి దాని గురించి అసెంబ్లీలో రోజుల తరబడి చర్చ జరగాలి. బహిరంగ సభలు, సదస్సులు, సెమినార్లు, చర్చా వేదికలు, ధర్నాలు తదితర సందర్భాల్లో మెజారిటీ జనాభా కలవారు బీసీలని చెప్పింది కూడా రాజకీయ పార్టీలే. కానీ, కుల గణన నివేదికలోని లెక్కలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి.

> **స్వాతంత్య్రం వచ్చాక ఎంతో మంది అగ్రవర్ణాల నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరగాలని పోరాడారు. త్యాగాలు కూడా చేశారు. కానీ, ఇప్పుడు అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. రాజ్యాధికారానికి దూరంగా ఉన్న కులాలకు, వర్గాలకు, అగ్రవర్ణాలు అండగా నిలబడాల్సిన సందర్భం ఇది. 75 ఏండ్లుగా హక్కుల కోసం అధికారంలో వాటా కోసం పోరాడుతున్న బీసీలు ఇప్పుడు ప్రతిఘటించక పోతే భవిష్యత్తు తరాలు అంధకారంలో పడే ప్రమాదం ఉన్నది.**

మేధావులు, విద్యావంతులు, బుద్ధి జీవులు, యువకులు, మహిళలు, రైతులు అందరూ ఏకమై జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేయాల్సిన సందర్భం ఇది. శాస్త్రీయమైన జనగణన ప్రకారం రిజర్వేషన్ల పంపకాలు జరగాలి. రాజకీయాలకు అతీతంగా నాయకులు ఏకం కాకుండా ఇది సాధ్యం కాదు. రాజ్యాంగ సవరణకు డిమాండ్ చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి మెజారిటీ ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలి. లేదంటే బీసీలకు అన్యాయం చేసిన పార్టీగా చరిత్రలో కాంగ్రెస్ మిగిలిపోతుంది. ■

> **మంత్రివర్గంలో ఉత్తమ్ కంటే సీనియర్లు అయిన పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ వంటి బీసీ మంత్రులు ఉన్నప్పటికీ వారిని కాకుండా ఉత్తమ్‌నే నియమించడం వెనక మతలబును అర్థం చేసుకోవచ్చు. అఖిలపక్ష సమావేశాలుగానీ, కులసంఘాల సమావేశాలు గాని నిర్వహించకుండానే కులగనణన పూర్తి అయినట్టు ప్రభుత్వం ప్రకటించింది.**